


చక్కెర పరిశ్రమను తెరిపించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మూతపడిన ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను తెరిపించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం కార్యక్రమంలో భాగంగా లచ్చయ్యపేటలో ఉన్న ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో శుక్రవారం ఆయనతోపాటు రైతు సంక్షేమ సంఘం నాయకులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కొత్తపెంట మాజీ సర్పంచ్ బేతనపల్లి సత్యం నాయుడు మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీని మళ్లీ ఓపెన్ చేసి, రైతులకు, కార్మికులకు ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత అధికార పార్టీ గానీ, ప్రధాన ప్రతిపక్షం గానీ దీని ఊసే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంతసేపూ సీట్లు, ఓట్లు, నోట్లు తప్ప స్థానికంగా ఉన్న రైతులు బాధలు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికలు వస్తే ఓట్లు వేసి గెలిపించాలని ఎలా తిరుగుతారని ప్రశ్నించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

గిరిజన వర్సిటీ శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, సాలూరు, దత్తిరాజేరు



బహిరంగ సభకు హాజరైన జనాలనుద్దేశించి మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యసేవల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛమైన మనసు, కల్మషం లేని మనుషులు ఎవరైనా ఉన్నారంటే అది గిరిజనులేనని పేర్కొన్నారు. తరతరాలుగా వారిని పేదరికం వెంటాడుతోందని, ఇప్పటికీ కూడా మిగతా ప్రపంచంలో సమం కాని వారి జీవన ప్రమాణాలు, ప్రత్యేకించి వారి జీవితాలను మార్చే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పురోగతి సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దు గ్రామాల పరిధిలో 561.88 ఎకరాల్లో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు చినమేడపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర విద్య, నైపుణ్యాభివద్ధిశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో సిఎం మాట్లాడారు. నేడు తలపెట్టిన గిరిజన వర్శిటీ సంకల్పంతో తరతరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్య, సాధికారత కోసం, ప్రపంచంతో పోటీ పడే పరిస్థితి రావాలని, ఆ పోటీలో మన రాష్ట్ర విద్యార్థులు గెలవాలని ఆకాంక్షించారు. ఇందుకోసమే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు చేస్తున్నామన్నారు. నాడు - నేడు పథకంలో భాగంగా స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేస్తూ... ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్స్ (ఐఎఫ్‌పి)లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరెక్కడా లేని విధంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఐటిడిఎ పరిధిలో మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ నిర్మాస్తామని ఇచ్చిన మాట ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పార్వతీపురంలో రూ. 250 కోట్లు ఖర్చు చేస్తూ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి గిరిజన గ్రామంలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీల నుంచి సేకరించిన భూములకు, ఇతర పట్టా భూముల కంటే 10 శాతం ఎక్కువ పరిహారం ఇచ్చేందుకు ఇచ్చిన మాట ప్రకారం జీవో 109 జారీ చేశామని తెలిపారు. తొలుత సభలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్వాగత ప్రసంగం చేశారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం ద్వారా ఇక్కడ యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 561 ఎకరాల భూమిని యూనివర్శిటీ యాజమాన్యంకు అప్పగించామని గుర్తు చేశారు. 42 నెలల్లో గుర్తించిన ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ నిర్మాణ పనులు పూర్తవుతాయి అన్నారు. మొదటి దశలో భాగంగా రూ.420 కోట్లతో కొన్ని పనులు ప్రారంభయ్యాయని చెప్పారు. గిరిజన ప్రాంత ప్రజల కళలు, సంస్కృతీ సంప్రదాయాలకు యూనివర్శిటీ చక్కని వేదికగా మారుతుందని పేర్కొన్నారు. విద్య, పరిశోధనలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు దూరంగా నిర్మించాలని ప్రయత్నించిందని, కానీ సిఎం జగన్ ప్రధానితోనూ, కేంద్ర పెద్దలందరితోనూ మాట్లాడి గిరిజన యూనివర్శిటీ గిరిజన ప్రాంతంలోనే ఉండాలని ఒప్పించారని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయడం పొరుగు రాష్ట్రాలకు కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. యూనివర్శిటీతో గిరిజనులకు మరింత మెరుగైన విద్య అందుతుందని అన్నారు. సిటియు వైస్ ఛాన్సలర్ కట్టమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత విద్యార్థులకు ఇదొక వరమన్నారు. అనంతరం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అరకు ఎంపి గొట్టేటి మాధవి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావు, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, పుష్ప శ్రీవాణి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జివిజి శంకరరావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





సిటియు ప్లాన్ గురించి సిఎంకు వివరిస్తున్న విసి కట్టమణి ; సిఎంకు బొబ్బిలి వీణను బహూకరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ



వేదికపైకి అవకాశమివ్వకపోవడంతో ఎదురుగా కూర్చున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అడియాశే

- నిరాశపర్చిన సిఎం పర్యటన
- వరాలు ఇవ్వని సిఎం
- స్థానిక సమస్యలు చెప్పకునేందుకూ నోఛాన్స్
- సభలో గిరిజనులను భాగస్వామ్యం చేయలేని వైనం
- వైసిపి శ్రేణులకూ రుచించని సిఎం ప్రసంగం
- డిప్యూటీ సిఎం రాజన్నదొర స్పీచ్‌కు తలశిల అడ్డుకట్ట
- మంత్రి బొత్సకు నో మైక్
- స్థానిక ఎమ్మెల్యే అప్పలనర్సయ్యకూ వేదికపై దక్కనిచోటు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ప్రజలకు అత్యంత నిరాశ, నిస్పృహలకు గురిచేసింది. ప్రత్యేకించి వైసిపి కార్యకర్తలకు ఏమంతగా రుచించలేదు. పాత విషయాలే చెప్పారని, స్థానిక సమస్యలు చెప్పకునేందుకు ఎమ్మెల్యే మంత్రులకు అవకాశం ఇవ్వలేదని సభకు వచ్చిన ఎక్కువ మంది నోట వినిపించింది. మరోవైపు ఉత్తరాంధ్రలో తిరుగులేని నేతగా, ప్రభుత్వంలో అత్యంత కీలకంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై చాలా మంది వైసిపి నాయకులు, క్రియాశీలక కార్యకర్తల్లో నైరాశ్యం కనిపించింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రీయ గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపన సందర్భంగా దత్తిరాజేరు మండలం మరడాం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రంగాలకు చెందిన ఛైర్మన్లు హాజరైనప్పటికీ, కనీసం ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు కూడా వేదికపై అవకాశం కల్పించలేదు. స్థానిక ఎమ్మెల్యే అప్పల నర్సయ్యను కూడా వేదికపైకి ఆహ్వానించకపోవడంతో తమ సమస్యలు విన్నవించుకునేందుకు అవకాశం లేకపోయిందంటూ గజపతి నగరం నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వైసిపిలో పవర్ ఫుల్ లీడర్‌గా వున్న మంత్రి బొత్సకు కూడా మాట్లాడేందుకు అవకాశం కల్పించక పోవడం పట్ల చాలా మంది నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యాశాఖ మంత్రి హోదాలోనైనా ఆయనకు అవకాశం కల్పించాల్సి వుందని, సిఎం ఉద్దేశపూర్వకంగానే అవకాశం ఇవ్వలేదని కొంతమంది నోట వినిపించింది. జిల్లా, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వకపోయినా, సాలూరు, గజపతి నగరం నియోజకవర్గాలకు అవసరమైన అభివృద్ధి పనులు లేదా సమస్యల పరిష్కారం విషయమైనా సిఎం మాట్లాడలేదు. వాస్తవానికి గుర్ల గెడ్డ జలాశయం 25ఏళ్లగా పెండింగ్‌లో ఉంది. కేవలం రూ.16కోట్లు ఖర్చుచేస్తే సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తోటపల్లి నుంచి వచ్చే గజపతినగరం బ్రాంచి కెనాల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దత్తిరాజేరు మండలంలో చాలా వరకు సాగునీటి అవకాశం లేక ఎక్కువగా కరువు కాటకాలతో అల్లాడుతోంది. అందుకే ఇక్కడి నుంచి వలసలు కూడా ఎక్కువగా ఉన్నాయి. మానాపురం రైల్వే వంతెన పనులు రెండు దశాబ్దకాలంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా కొఠియా గ్రామాల ప్రజలకు మన రాష్ట్రం తరపున పెద్దగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదనే ప్రచారం ఒడిశా ప్రభుత్వం చేస్తోంది. సాలూరు పట్టణంలో రహదారుల విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఇవన్నీ చిన్నచిన్న సమస్యలే అయినా స్థానికులకు పెద్ద ఆటకంగాను, అవరోధంగాను ఉన్నాయి. వీటి గురించి చెప్పుకునేందుకు ఎలాగూ అవకాశం కల్పించలేదు సరికదా కనీసం ముందస్తుగా తెలుసుకుని, వాటిపై హామీలైనా ఇవ్వలేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులను విస్మరించి, సమస్యలను ప్రస్తావించకుండా పాలన సాగిస్తే వచ్చే ఎన్నికల్లో కష్టమేనని కూడా రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. గిరిజనుల ఉద్ధరణకు ఏర్పాటు చేస్తున్నామంటున్న గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపన సభలో గిరిజనులను భాగస్వామ్యం చేయలేక పోయారు. ఇందుకు సభ విజయనగరం జిల్లాలో జరపడం ఒక కారణమైతే, పార్వతీపురం మన్యం జిల్లా అధికార యంత్రాంగాన్ని నామమాత్రంగానే భాగస్వామ్యం చేయకపోవడం రెండో కారణంగా చెప్పుకోవచ్చు. చివరకు గిరిజన శాఖ మంత్రి రాజన్నదొరను సభాధ్యక్షుడిగా ప్రకటిస్తూనే ఆ స్థానానికి దూరం చేస్తూ స్థానికేతర వ్యాఖ్యాత అన్నీ తానై వ్యవహరించారు. రాజకీయ ప్రత్యర్థులపై స్పందించకపోవడం పట్ల కూడా వైసిపి కేడర్‌లో చర్చనడిచింది. రాజన్నదొర మాట్లాడుతుండగా సిఎం సభ ఏర్పాట్ల సమన్వయకర్త తలశిల రఘురాం ప్రసంగం ముగించాలంటూ ఆదేశాలివ్వడంతో సభికులు నివ్వెరబోయారు.

విద్యారంగ అభివృద్ధికి నిధులివ్వాలి

సిటియును త్వరగా పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి తగినన్ని నిధులు కేటాయించి త్వరిత గతిన పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సిఎం పర్యటనలో హంగులూ, ఆర్భాటాలు తప్ప విద్యారంగ అభివృద్ధి ఊసే లేకపోవడం విచారకరమని అన్నారు. మెంటాడ మండలంలో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర విద్యాశాఖా మంత్రి, రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటన జిల్లా విద్యార్థులను నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పర్యటనను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకున్నారే తప్ప జిల్లా విద్యారంగ అభివృద్ధి కోసం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రస్తావన లేదని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూయించి, దూరాన ఉన్న హై స్కూళ్లకు పంపించి, ఎంతో మంది పేద,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమైతే జగన్మోహన్ రెడ్డి తన ప్రసంగంలో గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని తెలిపారు. విభజన హామీలలో ఉన్న గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు రప్పించడంలో, నిర్మాణం చేపట్టడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని పేర్కొన్నారు.

తక్షణమే భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన విజయనగరం జిల్లాలో ఎంతో కొంత చదువుకోవడానికి సహకరిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ హాస్టల్ భవనాలు కట్టించడంలో, మెస్ చార్జీలు,మౌలిక సదుపాయాలు కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. మహారాజా కళాశాలను ప్రైవేటీకరణ చేసి విద్యార్థులను రోడ్డున పడేసిన జగన్మోహన్ రెడ్డి తన ప్రసంగంలో విద్యార్థులకు అండగా ఉంటున్నానని అనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 50శాతం సీట్లను అమ్ముకునే విధానం తీసుకువచ్చి వైద్య చదువు చదివే విద్యార్థులను నిరాశకు గురిచేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి నిధులు కేటాయించి విద్యారంగం అభివృద్ధి చేయాలని కోరారు. లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్‌అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపు కోట

పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, హామీ మేరకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు చేపట్టిన నిరసన కార్యక్రమాలు మూడోరోజు శుక్రవారం కొనసాగాయి. చివరిరోజు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్‌అంబాసిడర్లు, పంచాయతీ కార్మికులు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ జిఓ నంబర్ 680 ప్రకారం స్వచ్ఛభారత్ కార్మికులకు రూ.పది వేలు జీతం చెల్లిస్తానని ఇచ్చిన హామీ అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. గుర్తింపు కార్డు ఇవ్వాలని, బకాయి వేతనాలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రతి నెలా 5వ తేదీకల్లా కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.ముత్యాలు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షులు ఎన్.చిన్నారావు, మండల కార్యదర్శి బి.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి సిఎం సాయం

ప్రజాశక్తి-దత్తిరాజేరు



కేన్సర్ బాధితురాలితో మాట్లాడుతున్న సిఎం

జిల్లాల్లో చేపట్టిన పర్యటనల సందర్భంగా పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తమ కుటుంబ దీనస్థితిని విన్నవించుకొన్న ఎందరో అభాగ్యులకు ఉదారంగా సహాయం అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం విజయనగరం జిల్లా మెంటాడ మండల పర్యటన సందర్భంగా మానవతా హృదయంతో మరో మహిళకు ఆర్థిక సహాయం అందించారు. గరివిడి మండలం బిల్లలవలస పంచాయతీ కొండదాడి గ్రామానికి చెందిన కన్నూరు సరస్వతి(34) తల్లిదండ్రులు ఇద్దరూ కేన్సర్ వ్యాధితో మృతి చెందారు. ఆమెకు తన అనుకునే తోబుట్టువులు ఎవరూ లేరు. పైగా గత ఐదేళ్లుగా ఆమె కూడా గొంతు కేన్సర్‌తో బాధపడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతోంది. ఆమెకు ఎలాంటి జీవనాధారం లేకపోవడంతోపాటు ఆమె పరిస్థితి అగమ్యగోచరంగా తయారై రోజు గడవడమే కష్టంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫింఛను పొందేందుకు నిబంధనల ప్రకారం అవకాశం లేకపోవడంతో తనకు ప్రభుత్వ పరంగా ఏదైనా సహాయం అందించి తనను ఆదుకోవాలని శుక్రవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని కోరింది. స్పందించిన ముఖ్యమంత్రి తక్షణమే రూ.3 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమెకు వెంటనే సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరుచేస్తూ రెవిన్యూ అధికారులు చెక్కును సిద్ధం చేసి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం అందజేశారు.



ముంపునకు గురైన మార్కెట్ ప్రాంతం

నగరంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం సుమారు గంటపాటు భారీగా కువరగా ఆ తరువాత మోస్తారుగా కురిసింది. దీంతో గంటస్తంభం, మార్కెట్ ప్రాంతం, సిటీ బస్టాండ్, గణేష్ కోవెల రోడ్డు నీటితో నిండి పోయింది. రాజీవ్ నగర కాలనీ, బుచెన్న కోనేరు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సిటీ బస్టాండ్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వర్షం పడుతుండటంతో పుట్ పాత్ వ్యాపారులు, తోపుడు బండ్లు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. గురువారం సాయంత్రం కూడా వర్షం పడటంతో శ్రావణ శుక్రవారం వ్యాపారం జరగకుండా ఆటంకం కలిగించింది. గత మూడు రోజులుగా సాయంత్రం పూట కురుస్తున్న వర్షం వలన ప్రజలు, ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. లో తట్టు ప్రాంతాలు లో వర్షం నీరు చేరడంతో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు రోడ్లపై నీటిని కాలువల ద్వారా పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ శ్రీరాములు నాయుడు శుక్రవారం పర్యటించారు. నీటి పంపిణీ, పారిశుధ్యం, పార్కుల నిర్వహణ, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. అక్కడున్న సిబ్బందితో చేపడుతున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. నగరంలో మహిళా పార్కును పరిశీలించి మొక్కల సంరక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలను అడిగారు. నీటి పంపిణీ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. పైప్‌లైన్ లీకులను సరిచేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఎక్కడా బురద నీరు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి తాము చేస్తున్న కషికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. రోడ్లపై విచ్చలవిడి అమ్మకాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. గంట స్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం తదితర జన సమర్ధ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు ఇబ్బందికర పరిస్థితుల్లో అమ్మకాలను సాగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వీరి వల్ల ప్రధాన రహదారులు చెత్తాచెదారులతో నిండిపోతున్నాయని, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో చిరు వ్యాపారుల అమ్మకాలను క్రమబద్ధీకరించనున్నట్లు చెప్పారు.



వాటర్ ట్యాంకరును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

క్రీడా మైదానాలకు కొలతలు

ప్రజాశక్తి-వేపాడ



కొలతలు వేస్తున్న ఇంజినీరింగ్ అధికారి, సర్వేయర్లు

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివి, గురుకులం క్రీడా మైదానాలకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఆలీ శుక్రవారం కొలతలు వేశారు. రెండు విద్యాలయాల మైదానాలు ముళ్లపొదలతో అధ్వానంగా ఉండటంతో బాగుచేయాలని కలెక్టర్‌కు స్పందనలో వినతులు అందాయి. అయినా ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గురుకులం మైదానాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు స్పందించి, బాగుచేశారు. అధికారుల నిర్లక్ష్యంపై మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మైదానాలను బాగుచేసేందుకు పిఆర్ ఇంజినీరింగ్ అధికారి, సచివాలయ సిబ్బంది వచ్చి శుక్రవారం కొలతలు తీశారు. ఇప్పటికైనా మిగతా పనులు పూర్తిచేస్తారో, లేదో వేచి చూడాలి.

చురుగ్గా హైవే సర్వే

ప్రజాశక్తి -వేపాడ

పెందుర్తి-బొడ్డవర జాతీయ రహదారి సర్వే చురుగ్గా సాగుతోంది. పెందుర్తి నుంచి శృంగవరపుకోట మీదుగా బొడ్డవర వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పాటూరు, బొద్దాం గ్రామాల మధ్య రోడ్డు విస్తరణకు ఇరువైపులా ఎంత భూములు అవసరమో సర్వే చేసి, నిర్ధారిస్తున్నట్లు మండల సర్వేయర్ అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజు, గ్రామ సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సర్వేయర్ల బృందం



బస్సును అడ్డుకుంటున్న ప్రయాణికులు

బస్సుల్లేక ప్రయాణికుల ఆందోళన

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని డిపోల నుంచి 300 బస్సులను తరలించారు. దీంతో బస్సులు అందుబాటులో లేక శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు విజయనగరం, పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్సుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1గంటకు సిఎం సభ ముగిసినా రాత్రి 8గంటల వరకు బస్సులు అందుబాటులోకి రాకపోవడం, స్వస్థలాలు చేరేందుకు బస్సులు లేకపోవడంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. వచ్చిన బస్సులను అడ్డగించి నిరసన తెలిపారు. సిఎం పర్యటనకు బస్సులన్నింటినీ తరలించేస్తే ఎలా అని ప్రశ్నించారు. జనాల రాకపోకల పరిస్థితి ఏమిటని ఆర్‌టిసి అధికారులను నిలదీశారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుతున్న గ్రామస్తులు

ఉధృతంగా రాళ్లగెడ్డ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జియ్యమ్మవలస మండలం గడసింగిపురం వద్ద గల రాళ్లగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వరి పంట నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గత రెండు రోజులుగా గెడ్డ నడుము లోతు వరకు ప్రవహిస్తోందని, దాంతో వాహనాలు నిలిచిపోయి ఉద్యోగులు, వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కనీసం 108 వాహనం కూడ రాకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో రోగులకు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రాళ్ల గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

సరైన మోతాదులో పిచికారీ చేయాలి

ప్రజాశక్తి-గంట్యాడ

వరి పంటలో కలుపు నివారణ కోసం సరైన మోతాదులో పిచికారి చేయాలని శాస్త్రవేత్త తేజేశ్వరరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొండతామరపల్లిలో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పురుగులు, తెగుళ్ల తేడా గురించి వివరించారు. ఘన, ద్రవ జీవామృతాల వినియోగాన్ని తెలియజేశారు. చిరుధాన్యాలు ఉపయోగం, పంటల మార్పిడి, సమగ్ర సస్య రక్షణ గురించి వివరించారు. రైతు శిక్షణ కేంద్రం ఎడి చంద్రశేఖర్ మాట్లాడుతూ వరి పంటకు తెగులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు పాటించి, అధిక దిగుబడులను పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.శ్యామ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కోశాధికారిగా రమణరాజు

ప్రజాశక్తి-మెరకముడిదాం

వైసిపి జిల్లా సంస్థాగత నియామకాల్లో మెరకముడిదాం మండలానికి సముచిత స్థానం లభించింది. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎస్‌వి రమణరాజును జిల్లా కోశాధికారిగా, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కోట్ల విశ్వేశ్వరరావును జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమించారు. వారికి వైసిపి మండల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

గజపతినగరం సమీక్ష వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం వాయిదా పడినట్లు సిపిఒ పి.బాలాజీ తెలిపారు

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-గుర్ల

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కెల్లలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి 22 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను కెల్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను జనసేన సీనియర్ నాయకులు దంతులూరి రామచంద్రరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన గుర్ల మండల అధ్యక్షులు యడ్ల సంతోష్, నాయకులు బూసరి నూకరాజు, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మి పూజలు

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలో వరలక్ష్మి పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మి పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.



బ్యాంకు క్యాష్ ఇన్‌ఛార్జి హరిబాబును సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

బ్యాంకు ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-వంగర

స్థానిక ఎస్‌బిఐ బ్రాంచిలో వివిధ హోదాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులు పారసాన హరిబాబు, బి.అచ్చెన్నాయుడు, జి.అవినాష్, ఎ.ప్రసాద్‌ను శుక్రవారం బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. గత కొంతకాలంగా బ్యాంకులో ఖాతాదారులకు వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తులసిరావు, కృష్ణ, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. గ్రోత్‌సెంటర్ రోడ్లు

పారిశ్రామికవాడలో రహదారులపై పెద్దపెద్ద గోతులు ● కార్మికులకు తప్పని తిప్పలు

బొబ్బిలి గ్రోత్‌సెంటర్లో రోడ్లు భయంకరంగా మారాయి. మొదట, రెండో విడత లేఅవుట్లలో రోడ్లన్నీ గోతులమయంగా మారాయి. దీంతో కార్మికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రోత్‌సెంటర్లో మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పారిశ్రామికవాడ అభివృద్ధికి దూరంగా ఉంది. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు.



అధ్వానంగా తయారైన గ్రోత్‌సెంటర్ రహదారి

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్‌సెంటర్ రెండో విడత లేఅవుట్‌లో రోడ్లన్నీ గోతులమయంగా మారాయి. రోడ్లపై పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండో విడత లేఅవుట్‌లో పెద్ద పరిశ్రమలు బెర్రీ, ఇంపెక్స్, హిరా, అరోరా, సిరి, సహారా, యోన, విక్టోరియా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలతోపాటు హెరిటేజ్ మిల్క్ డెయిరీ ఉంది. ఆయా పరిశ్రమలకు రోజుకు వందల సంఖ్యల లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్లు గోతులమయంగా ఉండడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలకు ముడి సరుకు తేవాలన్నా, పరిశ్రమలలో ఉత్పత్తి చేసే సరుకు తీసుకెళ్లాలన్నా నరకం చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయాలని పారిశ్రామిక వేత్తలు, వాహనదారులు కోరుచున్నారు.

డ్యూటీలకు వెళ్లాలంటే నరకమే

గ్రోత్‌సెంటర్ పరిశ్రమలకు డ్యూటీలకు వెళ్లాలంటే నరకం అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కార్మికులు వాపోతున్నారు. ఇంపెక్స్ పక్క నుంచి ఉన్న రహదారి, సిరి పరిశ్రమ మీదుగా ఉన్న రహదారి పూర్తిగా పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎపిఐఐసి అధికారులు స్పందించి రోడ్లు వేయాలని కార్మికులు కోరుతున్నారు.

ఆదాయం కోట్లలో...

గ్రోత్ సెంటర్‌లో ఉన్న పరిశ్రమల నుంచి ప్రభుత్వానికి ఆదాయం కోట్లలో వస్తున్నప్పటికీ రోడ్లు, సెంటర్ లైటింగ్ నిర్వహణ బాధ్యత పట్టించుకోవడం లేదని పారిశ్రామికవేత్తలు వాపోతున్నారు. ప్రతి ఏడాది రూ.కోట్లలో వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లు, సెంటర్ లైటింగ్ నిర్వహణ చూడాలని పారిశ్రామిక వేత్తలు కోరుతున్నారు.

ముందుకు రాని భారీ పరిశ్రమలు

గ్రోత్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం లేదు. వైజాగ్ ప్రొఫైల్, మొయిలీ ఫెర్రో పరిశ్రమలకు స్థలం కేటాయించినా పనులు ప్రారంభించలేదు. బికె స్టీల్ పరిశ్రమ పూర్తిగా కంపెనీ స్థాపించకుండా స్థలాన్ని వెనక్కి ఇచ్చేసింది. మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లే పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సొంతంగా గోతులను పూడ్చుకుంటున్న పారిశ్రామికవేత్తలు

గ్రోత్‌సెంటర్లో పాడైపోయిన రోడ్లను గ్రావెల్, ఫెర్రో వ్యర్థాలతో పూడ్చుతున్నారు. పరిశ్రమలకు నిత్యం ముడిసరుకు తెస్తున్న లారీలు, పరిశ్రమల నుంచి ఉత్పత్తులను తరలిస్తున్న వాహనాలు గోతుల్లో కూరుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రోత్‌సెంటర్‌కు వాహనదారులు, డ్రైవర్లు భయపడి రాలేమని చెప్పడంతో ఫెర్రో పరిశ్రమల యాజమాన్యాలు ఫెర్రో వ్యర్థాలతో రోడ్లపై గోతులను కప్పి, తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎపిఐఐసి అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు కోరుతున్నారు.



గోతిలో వేసిన ఫెర్రో వ్యర్థాలు



విజేతగా నిలిచిన జిల్లా జట్టు

అండర్-16 క్రికెట్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతలవలస ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పది రోజులుగా జరుగుతున్న అండర్ 16 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. విజయనగరం, తూర్పుగోదావరి జట్ల మధ్య మూడు రోజులుగా జరుగుతున్న ఆఖరి మ్యాచ్‌లో విజయనగరం జట్టు 9 వికెట్ల తేడాతో తూర్పుగోదావరి జిల్లాజట్టుపై గెలిచింది. ఇప్పటికే విశాఖపట్నం, శ్రీకాకుళం జట్లపై గెలిచిన అతిథ్య జట్టు మూడో విజయం పొంది 18 పాయింట్లుతో పాయింట్ పట్టికలో అగ్రస్థానంలో నిలవడమే కాకుండా నార్త్ జోన్ విజేతగా నిలిచింది. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆటగాలను, కోచ్ లు చందక రమేష్, ఎస్ ఎస్ ఎస్ బహుదూర్, చందక చంద్రశేఖర్ లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ ఎన్ రాజు, ట్రెజరర్ పి సీతారామరాజు, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ ఛైర్మన్ పి. సన్యాసిరాజు, సెలెక్టర్లు బంగార్రాజు, సర్ఫరాజ్, వర్మ అభినందించారు.

ప్రజల కష్టాలు పట్టవా?

ప్రజాశక్తి-డెంకాడ

అధ్వాన రహదారితో ప్రజలు పడుతున్న ఇబ్బందులు పాలకులకు పట్టవా? అని టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు ప్రశ్నించారు. మండలంలోని చొల్లంగిపేట గ్రామాన్ని చంద్రశేఖర్ ఆధ్వర్యాన టిడిపి బృందం సందర్శించింది. గ్రామ సచివాలయ, అంగన్వాడీ కేంద్రం , ప్రభుత్వ పాఠశాల వంటి ముఖ్య ప్రదేశాలు కలిగిన ప్రధాన కూడలి దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 80 లక్షల రూపాయలతో జిఆర్‌పాలెం వరకు వేయించిన తారు రోడ్డును వైసిపి ప్రభుత్వం ఎలా మరమ్మతులు చేసే స్థితికి తీసుకొచ్చిందో వివరించారు. అధ్వానంగా మారిన ప్రధాన రహదారి వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి తేల్చుకుంటా మన్నారు. చలనం లేని ప్రభుత్వం స్పందించకుంటే ఆ రోడ్డుకు తామే మరమ్మతులు చేస్తామన్నారు. కార్యక్రమంలో సాగునీటి ఆనకట్ట మాజీ ఛైర్మన్ కలిదిండి రంగరాజు, టిడిపి నాయకులు బగ్గ లక్ష్మణరావు, యడ్ల సూరిబాబు, సూరిబాబు, మహంతి శ్రీను, బగ్గ రామారావు పాల్గొన్నారు.



రోడ్డుపైకి చేరిన నీరు

108, 104 వాహనాలకు రక్షణ కరువు



నిలువ నీడలోని 108 వాహనం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అత్యవసర సేవలు నిమిత్తం ప్రభుత్వం 108, 104 వాహనాలను మంజూరు చేసింది. అయితే ఈ వాహనాలకు కనీసం రక్షణ సౌకర్యం కల్పించకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడిచి వాహనాలు పాడైపోతున్నాయి. వాహనం పెట్టేందుకు షెడ్ లేకపోవడం వల్ల ముళ్ల పొదల మధ్యలో పెడుతున్నారు. దీంతో విషసర్పాలు వాహనాల్లోకి చొరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ప్రజలకు సేవలు అందించే వాహనాలకు రక్షణ నిమిత్తం షెడ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయాల్లో ఇన్‌ఛార్జుల పాలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఇన్‌ఛార్జుల పాలనతో ప్రజలకు సకాలంలో సేవలందడం లేదు. కె.జి.పూడి, జగ్గయ్యపేట, వీలుపర్తి, వావిలపాడు, బానాది గ్రామ సచివాలయాల్లో కార్యదర్శుల ఇన్‌ఛార్జి బాధ్యతలతో సేవల్లో జాప్యమవుతోంది. ప్రస్తుతం ఉన్న స్థానాల్లో పనిచేయడంతోపాటు అదనపు బాధ్యత వల్ల ఎటూ న్యాయం చేయలేకపోతున్నామన్నది కార్యదర్శుల వాదన. గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులను, ఇతర సిబ్బందిని భర్తీ చేసి, సకాలంలో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టిడిపిలో చేరిన వారితో అశోక్ గజపతిరాజు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని 10వ వార్డు కు చెందిన వైసిపి నాయకుడు బవిరెడ్డి రమణ నాయకత్వంలో 20 కుటుంబాల వారు శుక్రవారం పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు. వారందరికి అశోక్ గజపతి రాజు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి, గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని జనసేన మండల అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జంక్షన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన రైలు ప్రమాదంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు నక్కరాజు సతీష్ దుర్మరణం చెందారు. ఉదయం జంక్షన్‌లోని రైల్వే పట్టాలను దాటుతుండగా ఎదురుగా వస్తున్న రైలును గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సతీష్ జనసేన ఆవిర్భావం నుంచి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేశారనే మంచి గుర్తింపు జిల్లాలోని నాయకుల్లో ఉంది. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. సతీష్‌కు తల్లి అచ్చియమ్మ, భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. సతీష్ మృతి పార్టీకి తీరని లోటని పలువురు జనసేన కార్యకర్తలు, నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు.





రోదిస్తున్న సతీష్ తల్లి, భార్య, పిల్లలు

పట్టాలపై సతీష్ మృతదేహం

నూతన దంపతులకు జెడ్‌పి ఛైర్మన్ ఆశీర్వాదం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస మాజీ సర్పంచ్ దుల్ల అప్పన్న కుమార్తె, అల్లుడును జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నాయుడుబాబు, డిసిసిబి ఛైర్మన్ చిన్న రామినాయుడు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, జెసిఎస్ కన్వీనర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

43వ డివిజన్‌లో గడపగడపకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 43వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో ఉడా కాలనీ నుంచి అయ్యన్నపేట వెళ్లే మార్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళుతూ ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు ఎంతవరకు నేరుగా చేరువవుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ విఎస్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కషి చేశామన్నారు. మౌలిక వసతుల సదుపాయంలో కూడా 80 శాతం మేర పూర్తి చేశామని, ఈ అభివృద్ధికి అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి మరలా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తవలస

గవరపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల ఆలయానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లాలం అర్జునరావు, ఎల్లపు సూరిబాబు, పొట్నూరు వెంకట రత్నాజీ, నక్కరాజు చినరాము, కొరుపోలు అప్పారావు, గొంప దుర్గ ఉమేష్, పి.చిన్నప్ప పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు